క్లుప్తంగా

అలయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



వధూవరులను ఆశీర్వదిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పేదలకు అలయన్స్ క్లబ్ సిద్దిపేట సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల అన్నారు. ఆదివారం అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ ఉమాపార్థివ కోటిలింగాల ఆలయంలో ఓ యువతి వివాహం జరిపించారు. ఈ వివాహానికి ఆమె హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి మాట్లాడారు. అందరూ సేవే మార్గంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ, సోమ శివకుమార్, గంప శ్రీను, ఆత్మారాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీకాంత్ రెడ్డి



దూదిశ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారని ఆ పార్టీ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ గొనే మార్కండేయులు ఆదివారం తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి శనివారం రాత్రి రాష్ట్ర కార్యాలయంలో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దూది శ్రీకాంత్‌రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులవడంతో జిల్లా నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మిరుదొడ్డికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొండ వెంకటేశం మృతి చెందాడు. ఆయన కుటుంబానికి రూ.2 లక్షల పార్టీ సభ్యత్వ బీమా చెక్కును దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు బోరెం రాజేశ్వర్, మాదాసు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య



సమ్మె కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

జగదేవ్‌పూర్ (గజ్వేల్): గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్ మండల, గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం మునిగడపలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలను జోన్‌లుగా ప్రకటించాలి

సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



భాస్కర్

బెజ్జంకి(సిద్దిపేట): ఉమ్మడి జిల్లాలను జోన్‌లుగా ప్రకటించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బెజ్జంకిలో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రకటించిన జోన్లు, మల్టీ జోన్‌లు అస్పష్టంగా ఉన్నాయన్నారు. భౌగోళికంగా నిరుద్యోగులు, విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న 317 జీఓను ఉమ్మడి జిల్లా పరిధిలోకి తెచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీలకు అవకాశమివ్వాలని కోరారు. ఈ జీఓతో జూనియర్‌లుగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలలో సీపీఎస్ రద్దుపై సీఎం కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

అసంపూర్తిగా పశు వైద్యశాల



మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో 2016లో రూ.25 లక్షల వ్యయంతో పశువైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పూర్తికాలేదు. దీంతో మండల పరిధిలోని పశువులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనాలకు తుప్పు..



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు పెరిగిపోతున్నాయి. రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలతో పాటు వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను తగిన జరిమానా చెల్లించి తీసుకుని పోవాల్సి ఉంటుంది. కానీ వాహనం విలువ కన్నా అధికారులు విధించిన జరిమానా ఎక్కువగా ఉండటంతో యాజమానులు వాటిని తీసుకెళ్లడంలేదు. వాటికి భద్రత కల్పించకపోవడంతో తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయి.

కలవరపెడుతున్న మొగి పురుగు



మిరుదొడ్డి(దుబ్బాక): వరి సాగు చేస్తున్న రైతులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. వరికి మొగి పురుగు ఆశించడంతో కలవరపడుతున్నారు. మొగి పురుగులు పొలమంతా వ్యాపిస్తుండటంతో దిక్కు తోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. మండల పరిధిలోని కూడవెల్లి వాగు పరిసర ప్రాంతాల్లో సాగవుతున్న వరికి మొగి పురుగులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మించరు.. పట్టించుకోరు

- వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు
- ఏడాదైనా ప్రారంభం కాని పనులు
- వచ్చే వర్షాకాలంలోనూ తప్పని తిప్పలు
- త్వరగా పూర్తిచేయాలని డిమాండ్

వర్షాకాలంలో లో లెవల్ వంతెన వద్ద నీటి ప్రవాహం పెరిగి వాహనాల రాకపోకలు నిలిచిపోతుంటాయి. రైతులు కూడా తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి. ప్రజాప్రతినిధులు అనేక ఆందోళనలు చేయడంతో గత ప్రభుత్వం హైలెవల్ వంతెన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో శంకు స్థాపన చేశారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ గడువులోగా పూర్తి చేయాల్సి ఉంది. అయితే నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధి చేర్యాల నాగపురి రోడ్డులోని కడవేర్గు శివారులో లో లెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ.2.72 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది జూలైలో అప్పటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. ఆగస్టులో నిర్వహించిన టెండర్లలో పనులను హైదరాబాద్‌కు చెందిన మెగా కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. అప్పటి పరిస్థితుల దృష్ట్యా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడం, కోడ్ అమలులోకి రావడంతో బ్రిడ్జి నిర్మాణ అంశాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇది ఇలా ఉంటే గత డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనంతరం కాంట్రాక్టర్ పనులకు అగ్రిమెంట్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అగ్రిమెంట్ చేసుకున్న నాటి నుండి తొమ్మిది నెలల్లో నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంటుంది. ఒప్పందం చేసుకుని రెండునెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు.

వర్షాకాలంలో రాకపోకలు బంద్

చేర్యాల నాగపురి రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ దారి యాదగిరిగుట్ట వరకు అనుసంధానమై ఉంటుంది. సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి యాదాద్రి వెళ్లే భక్తులు, వాహనదారులు చేర్యాల నాగపురి మీదుగా వెళ్తుంటారు. వర్షాకాలం వస్తే కడవేర్గు గ్రామ శివారులోని లో లెవల్ వంతెన వద్ద నీటి ప్రవాహం పెరిగి వాహనాల రాకపోకలు నిలిచిపోతుంటాయి. దీంతో ఈ దారిలో వెళ్లే పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి, శభాష్‌గూడెం గ్రామస్తులతో పాటు యాదాద్రి వెళ్లే భక్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతుంటారు. రైతులు కూడా తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి. ఇక్కడ హై లెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులు పలు మార్లు ఆందోళనలు చేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో మళ్లీ వర్షాలు కురిస్తే తిప్పలు తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కడవేర్గు శివారులోని లో లెవల్ వంతెన పై నిలిచిన వర్షపునీరు (ఫైల్)



శంకుస్థాపన చేసిన శిలాఫలకం (ఫైల్)

పనులు పూర్తి చేయాలి



వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. మళ్లీ వర్షాకాలం వస్తే నీటి ప్రవాహం ఎక్కువై బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిచిపోయే అవకాశముంది. అధికారులు చొరవ చూపి నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– జంగ సుధాకర్, కడవెర్గు

ప్రభుత్వ అనుమతి రాగానే..

గత ఏడాది ఆగస్టులో వంతెన నిర్మాణానికి టెండర్లు నిర్వహించాం. కాంట్రాక్టర్‌తో పనుల ఒప్పందం గత డిసెంబర్‌లో అయ్యింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ హయాంలో మంజూరై ప్రారంభం కాని పనుల వివరాలు అడిగితే ఇచ్చాం. ప్రస్తుత ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభమవుతాయి.

– సందీప్, ఆర్‌అండ్‌బీ ఏఈ, చేర్యాల

బాధ్యతల స్వీకరణ

చిన్నకోడూరు ఎస్‌ఐగా బాలకృష్ణ



బాలకృష్ణ

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు ఎస్‌ఐగా బాలకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట కమిషనరేట్‌లో సీసీఎస్‌లో పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా ఉండాలన్నారు. సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దన్నారు.

దౌల్తాబాద్ ఎస్‌ఐగా శ్రీరామ్ ప్రేమ్‌దీప్



శ్రీరామ్ ప్రేమ్‌దీప్

దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా శ్రీరామ్ ప్రేమ్‌దీప్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కామారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కామారెడ్డి జిల్లా లింగంపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

కుకునూరుపల్లి ఇన్‌చార్జి ఎస్‌ఐగా శ్రీనివాస్



శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా పి.శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌గా చెందిన శ్రీనివాస్ సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. ఇక్కడ పని చేసిన పుష్పరాజ్ బదిలీపై నర్సాపూర్ వెళ్లారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



కుకునూరుపల్లిలోని వాసవీ మాత దేవాలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): వాసవీ మాత ఆత్మార్పణను పురస్కరించుకొని మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ మాతకు మహిళలు కుంకుమార్చన, సామూహిక పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాచం నవీన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం గుప్త, మండల అధ్యక్షుడు ఉప్పల రాజు, కార్యదర్శి శివకుమార్, కోశాధికారి రాజ్‌కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు స్రవంతి, కార్యవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: వాసవీ కన్యకా పరమేశ్వరీ మాత ఆత్మార్పణను పురస్కరించుకొని ఆదివారం హుస్నాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకముందు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కోలాటాలతో ఊరేగించారు. అమ్మవారి మూలవిరాట్‌కు 108 కలశాలతో పంచామృతాలతో అభిషేకాలు చేశారు. దంపతులు హోమాలు నిర్వహించారు.

దుబ్బాక: వాసవీ మాత ఆత్మార్పణ సందర్భంగా దుబ్బాకలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో వాసవీ మాతకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు శంకర్, మంజుల, నాగభూషణం, మాలతి, చింత రాజు, శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట ఎంపీడీఓ బదిలీ



సత్యపాల్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ నాలుగేళ్లకు పైగా పనిచేశారు. నాగర్ కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్లనున్నారు. బుధవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి సందర్శన



నోటీసు బోర్డులో పోలీసుల వివరాలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిని గజ్వేల్ సీఐ సైదా సందర్శించారు. ఆదివారం ఆసుపత్రి ఆవరణలో గజ్వేల్ పోలీసులు, సిబ్బంది వివరాల పత్రాన్ని నోటీసు బోర్డులో అతికించారు. అనంతరం ఆయన డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సమస్యలు ఏమైనా ఉంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు.

ముడోసారి మద్దతు ఇవ్వండి

హుస్నాబాద్: గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని ఆదివారం హుస్నాబాద్‌లో నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ నరేంద్రమోడీకి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు వేల్పుల నాగార్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



2001-02 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

చిన్నకోడూరు(సిద్దిపేట): పదేళ్ల పాటు కలిసి చదువుకున్న విద్యార్థులంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మండల పరిధిలోని గోనెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున బొడ్రాయి ప్రతిష్ఠ పూజలు చేశారు. అనంతరం పంబాల పూజారులు పట్నం వేశారు. గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం గ్రామం పొలిమేర చుట్టూ సరుగు వేశారు. బొడ్రాయి ప్రాణప్రతిష్ఠకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరై పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

◆ మహాలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు



విరాళం అందిస్తున్న భక్తులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల మహాలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం గడప ప్రతిష్ఠ పూజలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి వెల్దండి జ్యోతి సత్యనారాయణ రూ.1.10లక్షల విరాళం ఇచ్చారు. వేమిరెడ్డి బుచ్చిరెడ్డి రూ.15,116లు విరాళం ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ తోడేటి రమేశ్ తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు.

◆ కమిటీ ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): గోత్రాల కుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం బెజ్జంకిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవి, గౌరవ అధ్యక్షుడిగా తిపిరిశెట్టి నరెడ్ల రాములు, ప్రధాన కార్యదర్శిగా తాల్ల ప్రసాద్, కోశాధికారిగా తిపురాని తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తీపిరిశెట్టి అంజయ్య, ఉపాధ్యక్షులుగా తిపురాని అంజయ్య, నరెడ్ల ఉమేష్, ముఖ్య సలహాదారుడిగా దేవులపల్లి శంకర్, సలహాదారుగా భిక్షపతి తదితరులను ఎన్నుకున్నారు.

◆ సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యాదగిరి ఎన్నిక



యాదగిరి

గజ్వేల్: గజ్వేల్ సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాయిని యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలక మండలి ఎన్నిక కోసం ఆదివారం నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఇతర కమిటీ బాధ్యులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. నాయిని యాదగిరి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అమర నాగేందర్ ప్రకటించారు. కమిటీకి ఉపాధ్యక్షుడిగా నల్ల సీతారామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దుంబాల భూపాల్‌రెడ్డి, కోశాధికారిగా సుదగాని మల్లయ్యగౌడ్, క్రీడా కార్యదర్శిగా గంగాల నరేష్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి సహాయ ఎన్నికల అధికారులుగా అర్సం శ్రీనివాస్, పోగుల రమేష్ వ్యవహరించారు.

◆ సూర్య నమస్కారాల పోటీలు

గజ్వేల్‌రూరల్: సూర్య నమస్కారాల పోటీల్లో గజ్వేల్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరిణా మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీల్లో తొమ్మిది మంది విద్యార్థులు బంగారు పతకాలు, నలుగురు రజిత పతకాలను సాధించారన్నారు. శిక్షణ ఇచ్చిన యోగా టీచర్ ప్రసన్నను అభినందించారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందజేసినట్లు తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులు